విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు ముమ్మరం చేయాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారికి, చేయించు కున్నవారిపై చట్టపర మైన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. మంగళ వారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం - 1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహాకమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ, రెవిన్యూ, పోలీస్, అధికారులు సమన్వయంతో పనిచేసి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసి పీఎన్ డిటి) చట్టం పటిష్ట అమలుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పీసి పీఎన్ డిటి చట్టం అమలుతీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలను ఎన్ జీవోల ప్రతినిధుల సమన్వయంతో సంబంధిత అధికారులు ముమ్మరం చేయాలన్నారు. వైద్యులు ఇచ్చిన మందుల చీటీ ప్రకారమే మెడికల్ షాపుల్లో సంబంధిత మందులు విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా గత కమిటీ సమావేశంలో ఆమోదించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ స్వరూపరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. శర్మిష్ట, డిఐవో డాక్టర్ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ పిడి కె. పద్మావతి, డిసిపివో సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను కుష్టువ్యాధి రహితంగా తీర్చిదిద్దాలి

18 నుంచి ఆగస్టు 2వరకు ఇంటింటి సర్వే
కలెక్టర్ కె. వెట్రి సెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా ప్రారంభదశలోనే కుష్టువ్యాధిని గుర్తించి సకాలంలో యండిటి చికిత్సను అందించేందుకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని సంబంధిత వైద్యాధికారు లను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం గౌతమీ సమావేశ మందిరంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయకమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం, వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లను కలెక్టర్ కె. వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్. శర్మిష్ట, జిల్లా కుష్టు,టిబి నివారణాధికారి కె. సత్యనారాయణ, డిఐవో డా. నాగేశ్వరరావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో మూడేళ్ల తర్వాత తల్లి ఒడికి బాలుడు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా, పశ్చిమ బెంగాల్ హౌరాకు చెందిన డిసిపియు, పోలీస్, ఐసిడియస్, సిడబ్ల్యుసి సిబ్బంది కృషితో మూడు సంవత్సరాల తర్వాత ఓ బాలుడు తన కన్న తల్లి వద్దకు తిరిగి చేరిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలానికి చెందిన ఓ 12 సంవత్సరాల బాలుడు అలిగి 2021లో ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. కొడుకు ఇంటి నుంచి వెళ్ళిపోయినా తల్లి ఎవరికి ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఎవరైనా అడిగినా బంధువుల ఇంటికి వెళ్ళాడు అని చెప్పేది. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలంలోని ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ బాలుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా రైల్వే స్టేషన్లో ప్రత్యక్షం అయ్యాడు. ఒంటరిగా , అనుమానితుడుగా ఉన్న బాలుడిని గమనించిన రైల్వే శాఖ పోలీస్ సిబ్బంది బాలుడు ని చేరదీసి హౌరా లోని చైల్డ్ కేర్ సంస్థలో చేర్చారు. అనంతరం ఇటీవల హౌరాలోని డిసిపియు, సిడబ్ల్యుసి అధికారులు "ఘర్ పోర్టల్"లో వివరాలు నమోదు చేస్తూ ఉండగా అతడు ఇచ్చిన అస్పష్టమైన సమాచారంతో బాలుడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా అని ప్రాథమికంగా గుర్తించిన హౌరా అధికారుల బృందం ఏలూరు జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణిని ఫోన్లో సంప్రదించి బాలుడు వివరాలు తెలుసుకునేలా వీడియో కాల్ ఏర్పాటు చేశారు. బాలుడితో మాట్లాడిన ఏలూరు జిల్లా డిసిపివో అతని తల్లిదండ్రుల పేర్లు, వూరు వంటి వివరాలు ఏమన్నా కొన్ని గుర్తు చేసుకోమని కోరగా తాను కె.ఆర్ పురం పరిధిలోని కోయ గిరిజన వర్గానికి చెందిన వాడినని బాలుడు తెలిపారు. దీనితో ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశాలతో జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పద్మావతి పర్యవేక్షణలో జిల్లా డిసిపివో సూర్య చక్ర వేణి ఆధ్వర్యంలో బాలుడి ఫోటోతో ఏలూరు జిల్లా లోని ఐసీడీఎస్, సిడిపివోల సిబ్బంది సమన్వయంతో పలు గిరిజన హాస్టళ్లు సహా పలు గ్రామాల్లో విచారణ చేపట్టారు. చివరకు బుట్టాయిగూడెంలో బాలుడి తల్లిని గుర్తించారు.

అనంతరం బుట్టయిగూడెం చేరుకున్న సిబ్బంది బాలుడి తల్లి, కొడుకులతో గ్రూప్ వీడియో కాల్ ఏర్పాటు చేసారు. దీనితో బాలుడు తల్లిని గుర్తించడంతో ఆ బాలుడిని ఏలూరు జిల్లా పంపేందుకు అవసరమైన పత్రాలు సమర్పించాలని హౌరా పోలీసు అధికారులు కోరగా సంబంధిత వివరాలను పంపారు. దాంతో బాలుడిని ఏలూరు జిల్లాకు పంపించేలా అనుమతి ఇస్తూ హౌరా బాలల సంరక్షణ సమితి వారు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జూలై, 8వ తేదీ సోమవారం ఉదయం సంబంధిత అధికారుల పర్యవేక్షణలో బాలుడిని రైలు ప్రయాణం ద్వారా సిబ్బంది ఏలూరు కు తీసుకువచ్చి శనివారపు పేటలోని జిల్లా బాలల సంరక్షణ సమితి ముందు హాజరు పరిచారు.అనంతరం మంగళవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమక్షంలో బాలుడిని అతని తల్లికి క్షేమంగా అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కె. పద్మావతి, డిసిపివో సి హెచ్ సూర్య చక్రవేణి, బుట్టాయగూడెం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఝాన్సీ, డిసిపియు ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర- నూజివీడు:ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎ. శైలజ అన్నారు. నూజివీడు కోర్టు ఆవరణలో ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వలన ప్రాణాపాయాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు వారు పిల్ నంబర్ 116/24 లో ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని, లేనియెడల కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో అనుకోని విధంగా ప్రమాదం సంభవిస్తే హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. వాహన చోదకులు బయటకు వెళ్లేటప్పుడు తమపై ఆధారపడిన కుటుంబాలను జ్ఞప్తికి తెచ్చుకోవాలని, రోడ్డుపై జరగబోయే ప్రమాదాలను ముందుగా ఊహించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు.

తాజాగా హైకోర్టు వారి ఆదేశాల మేరకు కేసులు నమోదు చేయడం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: కాలానుగుణ వ్యాధుల నుండి రక్షణ పొందేందుకు విస్తృత పారిశుధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమావేశమై ఆయా శాఖలలో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ జిల్లా అంతటా కంటికి కనిపించేంత స్పష్టంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

వర్షాకాలం సీజన్లో డయేరియా, డెంగీ, జ్వరాలు తదితర వ్యాధులు అపరిశుభ్రత, నీటి కలుషితం కారణంగా ప్రబలుతాయన్నారు. ఎక్కడ చెత్తకుప్పలు, తాగునీటి పైప్ లైన్‌లు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. వీధుల్లో, షాపులు ముందు, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే చెత్త వేసేలా ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తడి,పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత మున్సిపాలిటీల వారీగా చేస్తున్న పారిశుధ్య కార్యక్రమాలపై ఆయా మున్సిపల్ కమిషనర్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ సిహెచ్ నరసింహ రాజు, పబ్లిక్ హెల్త్ ఎస్.ఇ ఏ.సుధాకర్, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఈఈ త్రినాధరావు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి విజయ్, మున్సిపల్ కమిషనర్లు, సహాయ మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

గీత వృత్తిని కాపాడాలి

విశాలాంధ్ర-నరసాపురం: తాటిచెట్లకు రక్షణ కల్పించి గీత వృత్తిని కాపాడాలని కల్లు గీతకార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. మంగళ వారం నరసాపురం మీరా గ్రంథా లయంలో దొంగ గంగాచలం అధ్యక్షతన జరిగిన గీత కార్మికుల నియోజకవర్గ విస్తృత సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ కనిపించే తాటిచెట్లు బుల్‌డోజర్ల దెబ్బకు నేలకు ఒరుగుతున్నా యన్నారు. పాలకులు కార్పొరేట్లకు భూములు ఇవ్వటం, రియల్ ఎస్టేట్ వ్యాపార దారులు తాటి చెట్లు కూల్చేసి గీత వృత్తిని దెబ్బ తీస్తున్నారన్నారు.తాటి చెట్లు ఉన్నంత వరకు గీత కార్మికులు ఉంటారని, గీచేవారు ఉన్నతకాలం పోరాడేందుకు సంఘాలు వుంటాయన్నారు. బీరు, బ్రాందీ, విస్కీ తదితర వాటితో కల్లును పోల్చవొద్దని కల్లులో ఎన్నో పోషకాలు, ఔషద గుణాలు ఉన్నాయని, ప్రభుత్వం కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. తాటి చెట్టుకి రూ.10 చొప్పున పన్ను కట్టించుకుని గీచేవారికే చెట్టు పై హక్కు కల్పించాలన్నారు.రాష్ట్ర సంఘం సంయుక్త కార్యదర్శి బొక్కా చంటి, జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తాటి, ఈత, ఖర్జూర హైబ్రిడ్ చెట్లను ఉపాధి హామీ పథకం ద్వారా పెంచాలన్నారు. సమావేశంలో పిచ్చేటి నరసింహ రావు,గుబ్బల విష్ణు,కాగితాల సత్యనారాయణ, ఇర్రింకి వెంకటేశ్వర రావు, బొక్క ఏడుకొండలు, కడలి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కొరత

పడకేసిన పారిశుధ్యం

విశాలాంధ్ర- పాలకోడేరు :మండలంలో కార్యదర్శుల కొరత వేధిస్తున్నది. దీనితో పాలన కుంట పడడమే గాక గ్రామాల్లో పారిశుధ్య పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఒక్కో కార్యదర్శికి రెండు నుండి మూడు పంచాయతీలు అప్పగించడంతో గ్రామ పాలన దాదాపు స్తంభించిపోయింది. రక్షిత మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తున్నది. పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వీధిలైట్ల నిర్వహణ, జనన, మరణ రిజిస్టర్ల నిర్వహణ, పన్నుల విధింపు, వసూళ్లతో పాటు పలు విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పలు పంచాయతీల్లో ప్రజలు కార్యదర్శుల కోసం మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తున్నది. వ్యయ ప్రయాసలతో అక్కడికి వెళ్లిన కార్యదర్శులు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు నిరాశగా వెను తిరుగుతున్నారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిలు ఉన్న వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చింది అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థవంతమైన అధికారులు ఉండాలి. గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉంటే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని సందేహం లేదు. అధికారులు లేని గ్రామాలకు అధికారులను నియమించేటందుకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం వృద్ధ కళాకారులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను రంగస్థల కళాకారులకు కూడా వర్తింపచేసి పేద, వృద్ధ కళాకారులను ఆదుకోవాలని ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, తెలుగు నాటక రంగ సంస్థ కళాకారులు తిరుపతి రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో వందలాది మంది కళాకారులు వివిధ రూపాల్లో కళలను ప్రదర్శించి వృద్ధాప్యంలో ఆకలితో అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారని, నిరుపేద వృద్ధ కళాకారులకను ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు.జూలై నెల నుండి పెంచిన వెయ్యి రూపాయలతో కలిపి ఇస్తున్న 4వేల రూపాయలు పెన్షన్ వృద్ధ కళాకారులకు వైద్య ఖర్చులు కూడా సరిపోవడం లేదని వారు వాపోయారు. చాలామంది ఈ దశలో ప్రభుత్వం తప్ప తమను ఆదుకునే వారు ఎవరూ లేరని నిరుపేద వృద్ధ కళాకారులందరికీ నెలకు 6వేల రూపాయలు పెన్షన్ ఇచ్చి పేద కళాకారులను ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దేవాదాయశాఖ భూముల వేలం పాట

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామ దేవాదయ శాఖ పరిధిలో వున్నా భూములు వేలం పాట, ఏలూరు గ్రూప్ టెంపుల్స్ ఈఓ సాంబశివరావు, కొయ్యలగూడెం గ్రూప్ టెంపుల్స్ ఈఓ షణ్ముఖం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గోపాలపురం రోడ్డులో ఎస్సార్ పెట్రోల్ బంకు పక్కన ఉన్న దేవాదాయశాఖ 6 ఎకరాల 13సెంట్లు 1,30,000కు, కె. హెచ్. పి.దుర్గాప్రసాద్, పాడుకొనగా, మల్లోలు పొలాలలో ఉన్న దేవదాయ శాఖ ఆరు ఎకరాల 25సెంట్లు భూమి రెండు లక్షల 38వేలకు కోన దయరాజు పడుకున్నారు. ఈ కార్యక్రమంలో మదన గోపాలస్వామి అలయ కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ, ముప్పిడి చిన్నబాబు, రాచూరి మదన్, నీలం రాంబాబు, గుమస్తా పార్థసారథి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే ఆలోచనలకు పదును పెట్టాలి

- ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : బాల్యం నుంచే ఆలోచనలకు పదును పెడితే అద్భుత ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఏపీ నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్స్పైర్ మనాక్ మెంటార్ షిప్ - 2024 అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్ షాప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ సునీల్ భాస్కర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్.జి.శ్రీనివాస్, ఎస్ ఈ ఆర్ టి స్టేట్ నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భాగ్యశ్రీ, డాక్టర్ మేరీ మాట్లాడుతూ విద్యార్థుల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమని, విద్యార్థుల ఆలోచనల్లో ఎల్లప్పుడూ చైతన్య క్రాంతి ప్రసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి.శంకర్ కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ శ్రీ ఫణికృష్ణ కర్రి, కార్తికేయ శర్మ, డాక్టర్ వినోత్ కుమార్ రాజా, డాక్టర్ భరణీ దరన్, డాక్టర్ సుదర్శన దీప, డాక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు వర్తకులు సహకరించాలి

జిల్లా జాయింటు కలెక్టరు సి.వి. ప్రవీణ్ ఆదిత్య

విశాలాంధ్ర-భీమవరం: బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు వర్తకులు సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య కోరారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జిల్లా జాయింటు కలెక్టరు సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకందారులతో సమావేశమై బహిరంగ మార్కెట్లో నిత్యవసర వస్తువులు ధర స్థిరీకరణపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించుటలో భాగంగా, జిల్లాలోని అన్ని రైతు బజార్లు,డి మార్టు, రిలయన్స్, సూపరు మార్కెట్ల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, రేట్లు వివరాలను అందరికీ కనబడేలా బోర్డులను డిస్ ప్లే చేయాలన్నారు. బియ్యం, కందిపప్పును ప్రజానీకానికి మార్కెటు ధరల కంటే తక్కువ ధరకు అమ్మకాలు చేయాలని జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు. అట్టి ప్రత్యేక కౌంటర్లలో అమ్మే బియ్యం, కందిపప్పు వివరాలు ఈ క్రింద విధంగా తెలియ జేశారు.స్టీమ్ రకం బియ్యం - కిలో ఒక్కింటికి రూ 49, ముడి రకం బియ్యం - కిలో ఒక్కింటికి రూ. 48, కందిపప్పు (దేశవాళి) - కిలో ఒక్కింటికి రూ. 160 అమ్మకాలు జరగాలని ఆదేశించారు. జిల్లాల్లో పప్పుల వ్యాపారం చేస్తున్న అందరు హోల్సేల్, రిటైల్ వ్యాపారులు ఈ నెల 12వ తేదీ లోగా వారి వద్ద ఉన్న అన్ని రకాల పప్పుల నిల్వలను భారత ప్రభుత్వం వారి వెబ్ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వేంకటేశ్వర రావు, డియస్ వో యస్.సరోజ, సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు, డియార్డీఏ పిడి యం.యస్.యస్.వేణుగోపాల్, ఏయస్ వో యం.రవిశంకర్, రైతు బజార్లు ఎస్టేటు అధికారులు,వర్తక సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులు పోరాటాలకు సమాయత్తం కావాలి

ఏఐటీయూసీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: ఆటో కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. మంగళ వారం తణుకు కొండాలమ్మ గుడి వద్ద జరిగిన యూనియన్ సమావేశంలో భీమా రావు, తణుకు ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులపై అధికారుల వేధింపులు విడనాడాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. నూతన రవాణా చట్టాలు ఆటో కార్మికులకు గుదిబండలుగా మారాయన్నారు. ఉపాధికోసం ప్రభుత్వాలపై ఆధారపడకుండా ఆటోలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించు కుంటున్న ఆటో కార్మికులను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తణుకు ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కొంగరాపు బాలకృష్ణ, కోశాధికారి పేరిచర్ల రాంబాబు, అత్తిలి శ్రీను, ఆవాల వెంకటేష్, నందా కృపదాస్ తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాలను ఎస్.సిలుగా గుర్తించాలి

విశాలాంధ్ర-ఉండి: బుడగ బేడా జంగాలను ఎస్.సి లుగా గుర్తించి కుల ధృవీకరణ పత్రాలను ఇవ్వాలని సీపీఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు కోరారు. మంగళవారం బుడగ బేడా జంగాలతో సీపీఐ ఆధ్వర్యంలో ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ తీవ్ర వెనుకబాటుతనంతో వున్న బుడగ బేడా జంగాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.గత ప్రభుత్వం వీరిని ఎస్.సి. జాబితాలో చేర్చుతామని చెప్పి మోసం చేసిందన్నారు.ప్రస్తుతం వీరికి ఏవిధమైన కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు.ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు స్పందిస్తూ బుడగ బేడా జంగాల సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు సనపల శ్రీనివాస్,కొమరాని శ్రీను, జంగాల సంఘం అధ్యక్షుడు వీరన్నపల్లి పెద్దులు, నెళ్ళగంటి చెంచు,కె.వెంకన్న, శివరాత్రి పెదవెంకన్న,వంటెద్దు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో పేదల సొంత ఇంటి కల నెరవేరుతోంది

విశాలాంధ్ర - కైకలూరు : ఎన్నికల హామీలలో భాగంగా ఉచిత ఇసుక పథకాన్ని ఈ నెల 8వతేదీన అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు.కైకలూరు ట్రావెల్స్ బంగ్లా నుంచి కైకలూరు పంచాయతీ కార్యాలయం వరకు ఇసుక ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ-రాష్ట్ర ప్రగతికి బాట అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుకను అందిస్తామని, జిల్లా స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి ఎ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ బొండాడ మోహిని వెంకన్నబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా పలు శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికోసం పనిచేయాలి కానీ రాజకీయాలు కాదు అన్నారు. ప్రతిగ్రామంలోను మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుందామన్నారు. 175 నియోజకవర్గాల్లో గోపాలపురం నియోజకవర్గాన్ని ఆదర్శప్రాయంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దారు రవికాంత్, ఎంపీడీవో తిరుపతిరావు, జెడ్పీటీసీ శామ్యూల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని డిఆర్ఓ జె.భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఓ జె.ఉదయ భాస్కర్‌రావు వివిధ శాఖల అధికారులతో కుష్టు వ్యాధి నిర్మూలనపై సమ న్వయకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి వ్యాప్తి చెందడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టనున్నామన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలావరకు అరికట్టవచ్చునని, వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చునని సూచించారు. కుష్టురహిత జిల్లాగా మార్చేందుకు తమవంతు సహకారం అందించాలని డిఆర్ఓ కోరారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డి. ఉమామహేశ్వర రావు, జిల్లా సహాయ వైద్యాధికారి బి.భానునాయక్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె. శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారిపై 200 మీటర్లకు పైగా గోతులు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉండటంతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ స్పందించి మరమ్మతు లకు ఆదేశించడంతో రహదారులశాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈప్రాంతంలో ఎంతో కాలంగా గోతులు పడి ఉండ టంతో ఈ మార్గంలో ప్రయాణించే వారంతా నరకయాతన పడుతున్నారు. దీన్ని మరమ్మతు చేయించాలని గత పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. సమస్య పరిష్కరించకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి, ఆవేదనతో ఉన్నారు. వీరు పడుతున్న ఆవేదనను ఇటీవల విశాలాంధ్ర ద్వారా వెలుగులోకి తెచ్చారు. ప్రయాణికులు పడుతున్న నరకయాతనను గమనించిన నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మరమ్మతులకు చర్యలు చేపట్టారు. దీంతో మరమ్మతు పనులు ప్రారంభిం చారు. ఎమ్మెల్యే స్పందించి పనులు చేయించడంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదవి చేపట్టి నెలరోజులు కాకముందే సమస్యను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేను అభినందిస్తున్నారు. దీని మరమ్మతే కాక ధర్మాజీగూడెం శివాలయం మలుపునుంచి వెలగలపల్లి వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారిలో మరమ్మతుకు గురైన చోట్ల రహదారి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలి : కామినేని

విశాలాంధ్ర - కైకలూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం శరవేగంగా సాగుతున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ తన 111వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో దేశప్రజలు, ప్రపంచ దేశాల ప్రజలందరికీ ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుమీద ఒక మొక్క) కార్యక్రమంలో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. మండలంలోని వరహాపట్నం గ్రామంలో తమ నివాసం వద్ద, కైకలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ తమ మాతృమూర్తి కీ.శే. కామినేని రాజేశ్వరమ్మ పేరు మీద మొక్క నాటారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో కాలుష్యం వల్ల కలిగే ఇబ్బందులు తొలగాలంటే ప్రజలందరూ ఒక మొక్కను నాటాలి అని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచన విధానం దేశ ప్రజలకి స్ఫూర్తి దాయకం కావాలని అన్నారు.ప్రతి పౌరుడు తమ తల్లిని తలుచుకుని మొక్కలు నాటితే తమ తల్లి శారీరకంగా లేకపోయినా మానసికంగా మనతో ఉన్నట్లు భావిస్తారని ప్రధాని ఇలాంటి ఆలోచనలు అవలంబిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, ఎన్‌డిఎ కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సమస్యలతోనే ప్రజలు సహజీవనం

విశాలాంధ్ర-పెదవేగి: గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ప్రజలు సమస్యలతో అవస్థల పాలయ్యారని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాల యంలో టిడిపి, జనసేన, బిజెపిలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పలు సంస్థల ప్రతినిధులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకు రాగా, ప్రజల కష్టాలను, సమస్యలను ఆలకించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు బొప్పన సుధా, మాగంటి మిల్లు బాబు, లావేటీ శ్రీనివాస్, నంబూరి నాగరాజు, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి ఎలక్ట్రికల్ ఏఈగా నాగ శేషుడు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : మండలంలో ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని నూతన ఎలక్ట్రికల్ ఏఈ కె.నాగశేషుడు తెలిపారు. మంగళవారం జీలుగుమిల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదవేగి మండలం నుండి బదిలీపై జీలుగు మిల్లి వచ్చినట్లు తెలిపారు. రాచన్నగూడెం, పి రాజవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కూడా ఆయన పరిశీలించారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఉంటే వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. నాగ శేషుడికి విద్యుత్తు సిబ్బంది ఆహ్వానం పలికి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌కు మరమ్మతులు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: స్థానిక యాగర్లపల్లి 25వ వార్డులో మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో వర్షపు నీరుతో బురద అవుతోంది. ఈ కారణంగా స్కూల్ పిల్లలకి ఇబ్బంది కలుగుతోంది. స్కూల్ పిల్లలు నడవడానికి వీలు కలిగేలా తాడేపల్లి గూడెం నియోజకవర్గ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సహకారంతో బ్లాక్ గ్రావెల్, చిప్స్ వేసి గ్రౌండ్ లెవెల్‌కు చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పూడి బాలాజీ, పూడి సురేంద్ర, వర్రి విజయ్, తానా బాబి, గడపు సతీష్,దగ్గు బాబి, సిరెడ్డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కాళ్ళ: ప్రతి నెల 9 వతేదీన జరిగే పి ఎస్ ఎం ఎస్ కార్యక్రమంలో భాగం గా మంగళవారం వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ ఆధ్వర్యంలో 54 మంది గర్భిణీ స్త్రీలకు వైద్యం నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణీలకు వారితో వచ్చిన సహాయ కులకు కాళ్ళకూరు గ్రామానికి చెందిన వీరమల్లు

సురేష్ దాతృత్వంతో మంచి పోషకాహారంతో కూడిన భోజనం, పండ్లు అందించారు. పిహెచ్ సిలో సుమారు రూ.40 వేల విలువైన రెండు సిమెంట్ బెంచ్ లు, రెండు బెడ్స్, 6 సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ సిబ్బందిచే దాత వీరమల్లు సురేష్ ను శాలువ, మెమెంటోతో చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, పి హెచ్ సి సిబ్బంది, హెల్త్ సూపెర్వైజర్స్, ఆశా వర్కర్లు, కాళ్ళకూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ నిర్వహణకు అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: అన్న క్యాంటీన్ నిర్వహణలో తనకు అవకాశం ఇవ్వాలని తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీస్ సెంటర్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ కు

ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వచ్చే మంగళవారం తాను అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. టీడీపీ నేత వలవల బాబ్జీ, బిజెపి నేత ఈతకోట తాతాజీ, ఉమ్మడి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర - కామవరపుకోట : మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని టిడిపి కామవరపుకోట మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.గత ఐదు సంవత్సరాలుగా పార్టీ అధికారంలో

లేకపోయినప్పటికీ తెదేపా నిర్దేశిం చిన లక్ష్యాలను చేరుకోవటానికి, ప్రజల్లోకి తీసుకు వెళ్ళటానికి నియోజకవర్గ సీనియర్ నాయకుల సూచనల మేరకు శాయశక్తులా కృషి చేశానని కిలారు ఎమ్మెల్యేకు తెలిపారు. పార్టీ నిర్దేశించిన అన్ని కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొంటూ పార్టీ విధేయుడిగా కట్టుబడి ఉన్నానని దానికి పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుచే ప్రశంసలు అందుకుని మండలంలో పార్టీని బలోపేతం చెయ్యడానికి తన వంతు కృషి చేశానని ఆయన పేర్కొన్నారు.

ప్రజలకు తోడుగా ఉంటా

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఏ సమయంలో అయినా తనను సంప్రదించవచ్చని వారి కష్టాల్లో తోడుగా ఉంటానని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లి గూడెంలోని బొలిశెట్టి నివాసం వద్ద

మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు వార్డుల నుంచి భారీగా వచ్చిన ప్రజలు తమ సమస్యలు చెప్పుకున్నారు. వాటిని పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో పాటు త్వరలోనే గ్రామ గ్రామాన అధికారులతో సహా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఉదయం నుంచి సుమారు నాలుగు గంటల పాటు ఈ ప్రజా దర్బార్ తన ఇంటి ముందు ఉన్న చెట్ల కింద కూర్చుని ప్రజల సమస్యలు వింటూ వారికి హామీ లిస్తూ ఎమ్ ఎల్ ఏ బొలిశెట్టి శ్రీనివాస్ గడిపారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పాస్టర్స్ ప్రధాన కార్యదర్శి జీవన్ కుమార్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన కే వెట్రి సెల్వి ని వారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రెవ. పి.జీవన్ కుమార్, ఏపీపీఎఫ్ ఏలూరు జిల్లా ప్రెసిడెంట్ రెవ.జాన్ పీటర్ , ఏపీపీఎఫ్ స్టేట్

ఎగ్జిక్యూటివ్ మెంబర్ రెవ.డా.పి.పి. యస్ కిరణ్, రెవ. చిక్కాల జోసఫ్, రెవ.ఎన్.ఎల్.పాల్ రాష్ట్ర , జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలసి వారికి శుభాకంక్షలు తెలిపారు. క్రైస్తవులకు సంక్షేమం చెయ్యాలని, వారి సమస్యల్ని జాప్యం లేకుండా పరిష్కరించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఉచిత ఇసుక అభినందనీయం

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ తీసుకువచ్చిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అభినందనీయ మని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమె భీమవరంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నెల రోజులలోపే అమలులోకి తెస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేసి

బడుగు, బలహీనవర్గ, సామాన్య ప్రజల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాట వేశారన్నారు. నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గత వైసిపి ప్రభుత్వం ఒక్క ఇసుక కుంభకోణం ద్వారా 50 వేల కోట్లకుపైగా కొల్లగొట్టారని వైసిపి నాయకులే ఇసుకాసుర అవతారం ఎత్తి పెద్ద ఎత్తున దోపిడీ చేశారని విమర్శించారు. పేదల ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షలు ఖర్చు అయితే అందులో 3 లక్షల రూపాయలు ఇసుకకే ఖర్చు చేయాల్సి వచ్చేదని ఎన్డీఏ ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంతో సామాన్య ప్రజలకు నిర్మాణ భారం తగ్గుతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

భవిత దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపు

విశాలాంధ్ర-పెంటపాడు : పెంటపాడు మండలం సమగ్ర శిక్ష భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయిని లు షేక్ మస్తాన్ బి, వి సునీతల అధ్యక్షతన,ప్రతి మంగళవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపునకు ముఖ్యఅతిథిగా పెంటపాడు మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాస్ విచ్చేసి భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ

సేవలను గురించి, దివ్యాంగుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.తరువాత కండరాలు బిగుసుకుపోయినా,మెడ నిలబెట్ట లేకపోయినా, కూర్చోలేకపోవటం,సరిగా నడవలేని పిల్లలకు డాక్టర్ అల్లు శ్రీ కృష్ణ మహేష్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు.కాబట్టి మండలంలోని దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు ఈ సేవలు వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌పిలు, దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: గ్రామపంచాయతీలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు, ఇఓపిఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలతో పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ గ్రామాల్లో నూరు శాతం పారిశుద్ధ్య కార్యక్రమాలు ఖచ్చితంగా జరగాలన్నారు. చెత్త మేట వేసిన ప్రదేశాలను గుర్తించి జెసిబి లను ఉపయోగించి ట్రాక్టర్ల ద్వారా తరలించాలన్నారు.శానిటేషన్ లోపిస్తే ఆ ప్రాంతంలో డయేరియా, డెంగ్యూ, జ్వరాలు విజృంభిస్తాయని, ఇటువంటి పరిస్థితి రాకముందే నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా చేపట్టాలన్నారు. వర్షాలు కారణంగా కొబ్బరి బొండాలు, టైర్లు, కుండీలు తదితరాలలో నీళ్లు నిలవకుండా జాగ్రత్త పడాలన్నారు. డ్రైన్స్ లో నీటిపారుదలకు ఆటంకం లేని విధంగా డీసిల్టింగ్ చేయాలని, మట్టిని దూరంగా ఒక ప్రాంతంలో వేయాలన్నారు. వాటర్ ట్యాంకు లను ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలని, శుభ్రం చేసిన తేదీలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వాటర్ ట్యాంకులపై మూతలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని, అలా చేయకపోతే ఏదైనా పక్షులు, ఎలుకలు, ఉడతలు వంటివి నీటిలో చనిపోవడం వల్ల నీరు కలుషితమై డయేరియా ప్రబలుతుం దన్నారు.తక్కువ ఎత్తులో గుంటలో ఉండే పంపులను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా అందించిన ఫాగింగ్ మిషన్ లు, తదితర పనిముట్లను వినియోగించేలా చర్యలు తీసుకోవా లని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. త్రాగునీటి పైపులైన్ల లీకేజీలను వెంటనే అరికట్టాలని తెలిపారు. సరైన మోతాదులో తాగునీటిని క్లోరినేషన్ చేసిన పిదప మాత్రమే తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. గతంలో డయేరియా ప్రబలిన ప్రాంతాలను తెలుసుకొని ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో వంట చేసే పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని, గంజిని నేలపై కాకుండా ఒక గిన్నెలోనికి వంచి దూరంగా పారపోయాలన్నారు. చేపల చెరువుల నీటి కారణంగా త్రాగునీటి వనర్లు కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జన సమర్థంగా ఉన్న ప్రాంతాలు, మార్కెట్ యార్డులు, చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి హేబిటేషన్, మండల స్థాయిలో పారిశుద్ధ్య పర్యవేక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రతిరోజు శానిటేషన్ పై ఆరా తీయాలి అన్నారు. ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఒక టీం గా ఏర్పడి పారిశుద్ధ్యం పై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పంచాయతీ స్థాయిలో పరిష్కరించాల్సిన చిన్న చిన్న సమస్యలు కూడా జిల్లా స్థాయి గ్రీవెన్స్ కు వస్తున్నాయని ఇటువంటి వాటిపై పంచాయతీ సెక్రటరీలు, ఈవోపీఆర్డీఓలు తగు శ్రద్ధ తీసుకొని న్యాయబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. జూమ్ కన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, ఇంచార్జ్ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వివి నాగేశ్వరరావు, భీమవరం డి ఎల్ డి వో అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రాజ్యాంగం పుస్తకం

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ని దళిత ఐక్య నాయకులు మంగళవారం కలెక్టరేట్ లో కలిసి భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్

మాట్లాడుతూ ఇంటింటా రాజ్యాంగం పుస్తకాన్ని జిల్లా అధికారులందరికీ అందిస్తున్నామని, ప్రతి ఒక్కరికీ రాజ్యాంగంపై అవగాహన ఉండేందుకు ఈ పుస్తకాన్ని అందిస్తున్నామని అన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలకు రాజ్యాంగంలో అనేక హక్కులున్నాయని, వీటిపై జిల్లాలో సభలు సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పాలపర్తి జోనా, గొల్లా రాజ్ కుమార్, ఆలమూరి బాబ్జీ, మరపట్ల మునియ్య దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులను దారి మళ్లించారు

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్ళించిందని, నిధులను దుర్వినియోగం చేసిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ

విమర్శించారు. భీమవరం బిజెపి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర పరిస్థితి దారుణంగా ఉందని, స్వల్ప సమయంలోనే కొన్ని విషయాలపై అవగాహన చేసుకున్నానని, కేంద్ర మంత్రులను ఇతర అధికారులను రాష్ట్ర అభివృద్ధిపై కలిసి చర్చించడం జరిగిందని, ఆంధ్ర రాష్ట్రానికి అందరూ సహకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పేరిచర్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా పై అవగాహన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో బయ్యనగూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు స్టాప్ డయేరియా కార్యక్రమం పై ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్. సుబ్రహ్మణ్యం ఆరోగ్య విద్యా బోధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా

ఉండాలని ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని విద్యార్థులకు వివరించారు. కలుషితమైన నీరు త్రాగడం వలన, కలుషిత ఆహారం తినడం వలన, వాంతులు విరోచనాలతో అతిసారవ్యాధికి గురవుతారని అతిసార వ్యాధి చాలా ప్రమాదకరం, ప్రాణాంతకం అని వివరించారు. అతిసార వ్యాధిలో శరీరంలోని ఖనిజ లవణాలతో కూడిన నీరు వాంతి, విరోచనం, రూపంలో బయటకి పోయి డిహైడ్రేషన్ కి గురవుతారని సకాలంలో చికిత్స పొందకపోతే ప్రమాదం అని దాని నివారణకు గాను ఓ ఆర్ ఎస్ ద్రావణం త్రాగాలని 14 రోజులపాటు జింక్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్.కె. చాన్ బాషా, హెల్త్ అసిస్టెంట్ కె. మోహన్, ఏఎన్ఎంలు ఎం. నాగమణి, జి.అనసూయ, పాఠశాల ప్రధానోపాధ్యా యులు కే. రామకృష్ణ, ఉపాధ్యాయులు ఆశా కార్యకర్తలు శాంతి, జయలక్ష్మి, నళిని, స్వర్ణలత,పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి బోళ్ళ బుల్లిరామయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర-తణుకు: ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ బోళ్ల బుల్లిరామయ్య జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బోళ్ల బుల్లిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు

అర్పించారు. ఈ సందర్భంగా తెదేపా తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ మాట్లాడుతూ పారిశ్రామిక సామ్రాజ్య స్థాపనలో డాక్టర్ బోళ్ల బుల్లి రామయ్య ప్రముఖ ప్రజ్ఞాశాలి అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. పారిశ్రామిక, రాజకీయ, విద్యా, సేవా రంగాలలో ఆయన తనదైన ప్రత్యేకతను చాటుకున్న మహోన్నత వ్యక్తి డాక్టర్ బోళ్ల బుల్లి రామయ్యఅని అన్నారు. బోళ్ల బుల్లి రామయ్య తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలను ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర -తాడేపల్లి గూడెం : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో మంగళ వారం అధ్యక్షులు బి.హరికుమార్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. కొత్తగా రాష్ట్రంలో కూటమిగా ఏర్పాటైన ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు

చేయాలని కోరారు. 2018 నుండి డి.ఆర్ బకాయిలు, 11వ.పి . ఆర్.సీ బకాయిలు ,అడిషనల్ క్వాంటమ్ పునరుద్ధరణ లు, 12వ.పిఆర్.సీ నివేదిక రావడానికి ముందు గా 30పర్సంటు ఇంటీరీయర్ రిలీఫ్ చెల్లిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారన్నారు. నేటికీ ఏవిధమైన చెల్లింపులు జరగక పోవడం పై నిరాశ చెంది రాష్ట్ర అధ్యక్షులు ద్వారా ప్రభుత్వం వారిని సదరు చెల్లింపులు జరిపించి వలసినదిగా కోరుతూ తీర్మానం చేశారు. ఇన్ కంటాక్స్ రిటర్న్ దాఖలు చేసుకొన ని ఇంకా ఎవరైనా స భ్యులు వుంటే వారు తప్పనిసరిగా ఈనెల 31లోగా దాఖలు చేసుకొన వలసి నది గా కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, కె.బాల కృష్ణ, కె. సూరిరెడ్డి, పి. జయరాజు, ఇ.వెంకటేశ్వర్లు, ఎండి.ముస్తాఫా, గరిక పాటి సుబ్రహ్మణ్య శర్మ ,పి.విశ్వం రాజు ,కె. వెంకటేశ్వరరావు, జి.వి రంగారావు, పి.నాగరాజు, కె.సుబ్బారావు, దాసం వెంకట రమణ, పత్సావెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి, కృష్ణకుమారి, ఎల్.సరోజని, ఎస్.ప్రభావతి తదితర సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు.

విద్యతోనే మంచి భవిష్యత్తు

విశాలాంధ్ర-వీరవాసరం: విద్యార్థి దశ నుండే మంచిగా చదువుకుంటే భవిష్యత్తు గొప్పగా ఉంటుందని, అప్పుడే మీ కలలు సాకారం అవుతాయని జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు అన్నారు. మండలంలోని మత్స్యపురి, దుసన పూడి పాఠశాలల్లో మంగళవారం

విద్యార్థిని, విద్యార్థులకు స్కూలు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువు కుని మంచి భవిష్యత్తును పొందాలని సూచించారు. ఎంపిపి వీరవల్లి దుర్గభవాని మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చదువులో అన్ని విషయాలపై పూర్తి పరిజ్ఞానం కలిగినప్పుడే మరింత రాణించ గలరని, చదువుతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.అనంతరం మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షించి పిల్లలతో కలిసి భోజనం చేశారు.కార్యక్రమం లో సర్పంచులు శాంతిప్రియ, నాగసాయి, వైస్ ఎంపీపీ ప్రకాశం, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, చంద్రశేఖర్, వెంకట్, వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు, బాలాజీ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

విశాలాంధ్ర-వీరవాసరం: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రతి పేద కుటుంబం పేదరికం నుండి వచ్చేందుకు తమ పిల్లలను విద్యావంతులుగా చేయాలని ప్రిన్సిపాల్ కానుకొలను శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాయకుదురు జడ్పి హైస్కుల్లో నిర్వహించ బడుతున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం

సీనియర్ ఇంటర్ చదువు తున్న విద్యార్థినులకు పాలకొల్లుకు చెందిన ప్రముఖ దాత వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ తటవర్తి సుధాకర్ పదివేల రూపాయల ఆర్థిక సహాయంతో బోటనీ, జువాలజీ రికార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా విద్యను అభ్యసించేందుకు అనువైన వాతావరణాన్ని దాతలు సమకూర్చడం అభినందనీయమని, దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబోధనలు ఇప్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోత్సహాకులు పీర్ సాహేబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరం, ఉపాధ్యాయులు పి.గురుమూర్తి, పూర్ణచంద్రరావు, సాకా వర ప్రసాద్, బాలకృష్ణ, నాగకుమార్, కిరణ్ కుమార్, మెంటే అరుణ, వీరవల్లి నాగేశ్వరరావు, కాయల వీరాస్వామి, అంగర వేణు, తులసీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో గర్భిణీలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర- పోడూరు: ప్రధానమంత్రి మాతృ సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా పోడూరు మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 40 మంది గర్భిణీ స్త్రీలకు మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుప్రజ, డాక్టర్ శ్రీ వాసవి వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం అవసరమైన మందులు, తగు సలహాలు ఇచ్చారు. పరీక్షలు చేయించుకున్న గర్భిణీ స్త్రీలకు పోడూరు సత్యసాయి సేవా సమితి తరఫున రుద్రరాజు రమేష్ రాజు తదితర సభ్యులు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుప్రజ మాట్లాడుతూ ప్రతినెల 9వ తేదీన పీహెచ్ సి లో గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం

జరుగుతున్నదని తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలపై ముమ్మర తనిఖీలు చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం

విశాలాంధ్ర-ఏలూరు: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిశ్రమలు, కార్మిక, కాలుష్యనియంత్రణ, ఫ్యాక్టరీస్ తదితర శాఖల అధికారులతో జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అన్ని పరిశ్రమల్లో భద్రత పటిష్టం చేయాల్సివుందన్నారు. ఫ్యాక్టరీలలో చిన్నపాటి

నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీయవచ్చన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తరచూ మాక్ డ్రిల్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కార్మికులు, ప్రజల్లో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర మైన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో రక్షణ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్, ఖచ్చితంగా పాటించాలన్నారు. పరిశ్రమల లోపలే కాకుండా పరిశ్రమల చుట్టుప్రక్కలవున్న ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరింత భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నూతనంగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించల్సిన భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు.కాలుష్యనియంత్రణకు చేపట్టవలసిన పలు అంశాలపై కూడా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ ఛీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్. త్రినాధరావు , ఎపిఐఐసి జెడ్ఎం కె. బాబ్జి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు వి.ఆదిశేషు, కాలుష్యనియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, ఉప కార్మిక కమీషనరు పి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల భూసేకరణ ఎన్యుమరేషన్ పారదర్శకంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-భీమవరం: జాతీయ రహదారుల భూ సేకరణలో ఎన్యుమరేషన్ ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య సర్వే అధికారులతో సమావేశమై పలు అంశా

లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవేస్ భూ సేకరణలో భాగంగా ఆయా భూముల్లో ఉన్న ఇళ్ళు, షెడ్లు, చెట్లు వంటి వాటిని కచ్చితంగా లెక్కించాలన్నారు. భూసేకరణలో భాగంగా ఎన్యుమరేషన్ నిర్వహించేందుకు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని, టీం లో ఇచ్చిన రిపోర్టును తిరిగి తనిఖీ చేసేందుకు మరొక టీం లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆకివీడు, ఉండి, కాళ్ళ, భీమవరం, పాలకొల్లు, పాలకోడేరు, వీరవాసరం మండలాల్లో భూసేకరణ పనులు జరుగుతున్నాయన్నారు.సర్వే పై అందుతున్న ఫిర్యాదులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మనం చేసే పనిలో ప్రజల నమ్మకం కోల్పోకూడదని సూచించారు. ఎఫ్ లైన్, సబ్ డివిజన్, పి జి ఆర్ ఎస్ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. 22 ఏ కేసులను కూడా త్వరగా పరిష్కరించాలని ఆర్డీవోలను, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె .శ్రీనివాసులు రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎస్.లోకేశ్వరరావు, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సి హెచ్ రవికుమార్, డిప్యూటీ సర్వే అధికారులు, మండల సర్వేలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు ఘనస్వాగతం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా ఏలూరుకు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు నాయకులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం గం.10:30 లకు గన్నవరం విమానాశ్రయంకు చేసుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కి స్థానిక 7 నియోజకవర్గాల నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరు కూడా వారికి ఘన స్వాగతం

పలికారు. తొలుత హనుమాన్ జంక్షన్ లో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం, హనుమాన్ జంక్షన్ నుండి ఏలూరుకు ర్యాలిగా తరలి వచ్చారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు స్వాగతం పలికిన ఏలూరు పార్లమెంట్ 7 నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-ఏలూరు: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు డాక్టర్ జె. రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం, ఏలూరు లోని నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సర్. సి ఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా విద్యార్థులతో "డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో" సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ జె. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో ఉన్నతమైన భవిష్యత్తును ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమన్నారు. మాదకద్రవ్యాల నేరాలలో శిక్ష, జరిమానా రెండు కూడా కఠినంగా ఉంటాయన్నారు. సర్. సి ఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల కరెస్పాండెంట్ రాజారామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే అవగాహన కలిగి ఉండాలన్నారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ కె. ప్రియాంక మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 24 నుండి జులై 10 వరకు ఏలూరు, పరిసర ప్రాంతాలలో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్ సి ఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నరేంద్ర బాబు,ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ కె శైలజ, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ యస్.జాకబ్ రాజు,ఎస్.కె. నజ్మా, డి. విజయరాణి, డి.వెంకటేశ్వరరావు, వి. జయపాల్,జె. జ్యోతి చంద్రిక, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్స్ విద్యార్థులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రం తీసుకోండి : ఆర్డీవో అద్దయ్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : పంట సాగు చేసుకునే ప్రతి ఒక్క రైతు పంట సాగు పత్రాన్ని తీసుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో అత్తయ్య అన్నారు. పోలవరం పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో అగ్రికల్చర్ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో సాగుకు తీసుకుని

వ్యవసాయం చేస్తున్న రైతులు గ్రామ రెవెన్యూ పరిధిలో వీఆర్వో గాని రైతు సేవ కేంద్రం అధికారులతో గానీ మీ వివరాలు తెలియపరచి కార్డును పొందాలన్నారు. ఈ కార్డు యొక్క పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని చెప్పారు. సాగు దారుల హక్కు పత్రం ద్వారా రైతుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, భూమి సాగు చేస్తున్న వారికే పంట రుణాలు అందుతాయన్నారు. ఈ కార్డు వల్ల రైతు పండించే తమ పంటలకు మద్దతు ధర, పంట రుణము, ఇన్సూరెన్స్ లాంటివి వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి వి ఎస్ ప్రసాద్, వ్యవసాయ అధికారి కే రాంబాబు సిబ్బంది ఉన్నారు.

సమష్టి కృషితోనే విజయం సాధించాం

విశాలాంధ్ర-దేవరపల్లి: రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ లోక్సభ ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బిజెపి సమిష్టి కృషితోనే విజయం సాధించామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపి రాజు గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు పేర్కొన్నారు దేవరపల్లి మండలం దుద్దుకూరులో మంగళ వారం జనసేన కమిటీ ఆధ్వర్యంలో విజ యోత్సవ కృతజ్ఞత సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా దుద్దుకూరు జనసేన కమిటీ అధ్యక్షుడు సాంబ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లా డుతూ గోపాలపురం నియోజకవర్గంలో తెలుగు దేశం జనసేన బిజెపి సమిష్టి కృషి వలన ఎమ్మెల్యేలుగా తాను రాజమహేంద్రవరం ఎంపీ గా దగ్గుపాటి పురందేశ్వరి విజయం సాధిం చారని అన్నారు జనసేన నేతలు కృషి ఎంతో కీలకమైనదని ఎప్పటికీ జనసేన నేతలకు రుణపడి ఉంటాను అన్నారు గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలలో నాలుగు చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి డి సువర్ణరాజు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజులు మాట్లా డుతూ ఇప్పటం సభలోనే పవన్ కళ్యాణ్ ఎంతో ఉత్సాహంతో ప్రసంగించారు అన్నారు. ఇప్పటం సభ నుండే జగన్మోహన్ రెడ్డి పతనం ప్రారం భమైందని అన్నారు రాక్షస పరిపాలన అంతమం దించడానికి జనసేన తెలుగుదేశం బిజెపి నేతలు చేసిన కృషి మరువలేము అని అన్నారు. ప్రతి పచ్చ పార్టీ ఓట్లు చీలకొండ పవన్ కళ్యాణ్ చేసిన కృషివలనే విజయం సాధించామని అన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో ఎన్డీఏ కోటమి అధి కారంలో ఉందని రాష్ట్రం సర్వతోముఖాభి వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ అంతకు ముందు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్ళ పూడి బాపిరాజుకు గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి డి సువర్ణ రాజుకు దుద్దు కూరు జనసేన నేతలు స్వాగతం పలికారు. అంతకు ముందు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన జనసేన పార్టీ స్థూపాన్ని జెండాను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డి సువర్ణ రాజు ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు సంభ శ్రీనివాస్ జనసేన నాయకులు పాపోలుసురేష్ ప్రదీప్ మాలే సతీష్ సాంబశివ గోపి షేక్ రఫీ రామకృష్ణ కావ లసీతారత్న సూర్యకుమారి పి రాజేంద్ర ఎంటర్పాటి రాజు మూర్తి సప్పటి శివనాగ ప్రసాద్ పోలమాటి నాని కాజా మోహితి స్త్రీతెలుగుదేశం నేతలు కంటిపూడి సుబ్బారావు ముళ్ళపూడి దొరాజి చౌదరి కంటిపూడి నర సింహ కాకర్ల టి సౌజన్య ఎం సానారి కాకర్ల సృజన అమరావతి కె రవికుమార్ పప్పు రామా రావు కరుటూరి అబ్బులుద్వారకాతిరుమల నల్ల జర్ల దేవరపల్లి గోపాలపురం మండలాలకు చెం దిన జనసేన బిజెపి తెలుగుదేశం నేతలు మహి ళా నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

కూటమి ప్రభుత్వ వ్యవహారం విడ్డూరం

విశాలాంధ్ర - అనపర్తి : వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయగా మళ్లీ నేడు వంద పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేసినట్టు కూటమి ప్రభు త్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి విలేకరులతో మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రిగా ఏ విధంగా అభివృద్ధి చేశామో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని దీనిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం బిజెపి నాయకులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మా హయాంలో మంజూరు చేసిన రూ.13 కోట్లతో నిర్మాణంలో ఉన్న భవనాలకు కాకుండా కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి శంకు స్థాపన చేస్తే ప్రజలు హర్షిస్తారని అన్నారు. వారు చేసిన ఘనకార్యానికి ప్రజ లంతా ముక్కున వేలేసుకుంటున్నారని సత్తి సూర్యనారాయణ రెడ్డి అపహాస్యం చేశారు.

గుర్రపుడెక్క తొలగింపు

విశాలాంధ్ర - తాళ్లపూడి : రైతులంతా కలిసి ఆలోచన చేస్తే కొవ్వాడ కాల్వలో గుర్రపుడెక్క ను తొలగించు కోవటం పెద్ద కష్టం కాదని గజ్జరం గ్రామానికి చెందిన రైతు కాకర్ల చంద్ర శేఖర్ పేర్కొన్నారు. ఎంతో కాలంగా కొవ్వాడ కాలువ లో పేరుకు పోయే గుర్రపు డొక్క వల్ల ప్రతి యేటా కాల్వ లో చేరే వరద నీరు బయటికి పోయే మార్గం లేక సమీపం లో ఉన్న పొలాలు మీద ఎగ బాకుతోంది. దీని వల్ల రైతులు నష్ట బోతున్నారు. అధికారులు, నాయకులు దృష్టికి తీసుకు వెళ్లినా నిధులు లేమి గురించి వెల్లడి స్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా రైతు చంద్ర శేఖర్ ప్రయోగాత్మకంగా ఓ డ్రోన్ ద్వారా గుర్రపు డెక్కను నిర్మూలించే మందు పిచికారీ చేయించారు. రెండు రోజులుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా గుర్రపుడెక్క ఎక్కడికక్కడ చచ్చిపోతోందని అన్నారు. సుమారు కొవ్వాడ కాల్వ వెంట ఆరకిలోమీటరు పొడుగునా మందుకొట్టటానికి 12 వేలు ఖర్చు అయిందని, రైతులంతా సంఘటితంగా కూర్చుంటే తక్కువ ఖర్చుతో గుఱ్ఱ పుడెక్క బెడద వదిలించుకోవచ్చు అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం లో కొవ్వాడ పరిధి లోని రైతులు చాలా మంది గుర్రెపు డెక్కవల్ల ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని రవి తెలిపారు. చంద్ర శేఖర్, కొర్లపాటి దత్తుడులు చేసిన ప్రయోగం ఉపయోగ కరమేనని అన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కానసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ శివారు బుల్లెరేవు ప్రాథమిక పాఠశాల చిన్నారులకు అదే పాఠ శాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సిహెచ్ సుధాకర్బాబు సౌజన్యంతో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు సిహెచ్ సత్తిబాబు అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారి పివి వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు సుమారు రూ.5 వేల విలువ గల నోట్ పుస్త కాలు, స్టేషనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని చదువు నేర్పిన ఉపాధ్యాయులకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఉచిత ఇసుకతో ఊపందుకోనున్న నిర్మాణ రంగం

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్ : తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్రంలో నిర్మాణ రంగం రూపొందుకుంటుందని కొవ్వూ రు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కుమారదేవం గ్రామం ఇసుక ర్యాంపు వద్ద ఉచిత ఇసుక ప్రారంభోత్సవ కార్య క్రమం అనంతరం ముప్పిడి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ ఉచిత ఇసుక అందుబాటులోకి రావడానికి పేదలు సొంతింటి కల నెరవేరబోతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం చంద్రబాబు నాయుడు అధికారంలోనికి వచ్చిన నెలలోపే అమల్లోకి తెచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరా పేరుతో 98 లక్షల టన్నులు ఇసుకను జగన్ అండ్ కో మింగేసిందని ధ్వజ మెత్తారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశితోష్, దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని, దాయాన రామకృష్ణ, వట్టుకుట్టి వెం కటేశ్వర్ రావ్, ముత్యాలరావు, గంగ్రోతు పవన్, నవ్య, బూరుగుపల్లి వీర రాఘవులు టీవీ రామారావు మరియు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మందు బాబుల జేబులకు చిల్లు..
ప్రభుత్వ దుకాణాలలో అందని మద్యం

విశాలాంధ్ర - కొవ్వూరు : ఇప్పటికే మద్యం అధికధరల కారణంగా మందు బాబుల జేబులు చిల్లులు పడుతున్నాయి. మద్యం ప్రియులు లబోదిబోమంటున్నారు . వివరాల్లోకి వెళితే చాగల్లు మండలం చాగల్లులో మద్యం సరఫరా చేసే డిపో ఉంది. దీని పరిధిలో 117 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నట్లు అంచనా. ఇప్పటికే నాణ్యతలేని మద్యాన్ని అధిక ధరలకు సరఫరా చేస్తున్నారు. దీని ప్రభావం మొన్న జరిగిన ఎన్నికలలో ప్రభుత్వం మారేవరకు వచ్చింది. అయితే ఇప్పుడు ఆమద్యం కూడా ప్రభుత్వ దుకాణాలకు సరఫరా కావడం లేదు దీనికి కారణం చాగల్లు డిపో నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే వ్యాన్లు, ఇతర రకాల వాహ నాలకు ప్రభుత్వం నుంచి రావలసిన రవాణా చార్జీలు భారీ ఎత్తున పెండింగ్లో ఉ న్నాయి. దీంతో వాహనాలు యజమానులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించే వరకు వాహనాలలో మద్యాన్ని సరఫరా చేసేది లేదు అంటూ రవాణా వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో మద్యం సరఫరా గత కొన్ని రోజులుగా ఆగిపోయింది. దీంతో మందుబాబులు బార్లకు పరిగెడుతున్నారు. అయితే అక్కడ ప్రభుత్వ మద్యం దుకాణాల కన్నా క్వార్టర్ బాటిల్ కు 60 రూపాయలు ఎక్కువ కావడంతో అలవాటు మానలేని మందుబాబులు లబోదిబోమంటూ తలలు పట్టుకుంటున్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా అనుసూరి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : లయన్స్ క్లబ్ ఆఫ్ బనానా ల్యాండ్ ఏలే శ్వరం అధ్యక్షునిగా ప్రము ఖ నేత్రవైద్యులు అను సూరి నాగేశ్వరరావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పేద ప్రజలకు వైద్యసేవలు అందించడం ద్వారా లయన్స్ క్లబ్ గుర్తించి తనను అధ్యక్ష పదవికి ఎంపిక చేశారని అన్నారు. ఏలేశ్వరం పరిసర ప్రాంతాల్లో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో తన వైద్య సేవలను లయన్స్ క్లబ్ ద్వారా మరింత విస్తృత పరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. వృద్ధులకు 10 కేజీలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ వైస్ గవర్నర్ కెవి సుబ్బరాజు, డివిఎస్ రాజు, రీజన్ చైర్మన్ డాక్టర్ వై రామకృష్ణ, జోన్ చైర్మన్ పిఇ భరతవాజ్, క్లబ్ కార్యదర్శి పూర రాజబాబు, కోశాధికారి కప్పల భూషణం, సభ్యులు జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, ఏ గోపాలకృష్ణ, నడిమింటి ప్రసాద్, తాళ్లూరు గొల్లాజి, ఆదిములం కనక విజయ్, కోట శ్రీనివాస చక్రవర్తి, చదు వోలు రాజా, వారితో పాటు డాక్టర్ సజ్జా సునీల్, డాక్టర్ అఫ్జల్ ఖాన్, గొల్లపూడి గణేష్, అమృత లేబొరేటరీ అధినేత తుండూరి రాము ఉన్నారు.

పొగాకు వేలం ఆశాజనకం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు చరిత్రలోనే కిలో 378 రూపాయలు పలికింది. వేలం అత్యల్ప 245 సరాసరి 321 రూపాయల 85 పైసలు పలికిందని యాలం నిర్వహణ అధికారి జి ఎల్ కే ప్రసాద్ ఎస్ జీవో యామస్మిత తెలిపారుప్రారంభం నుండి రోజురోజుకీ పొగాకు దారులు పెరగడంతో రైతులు ఉత్సాహం ఉన్నారు ఎన్నో పెట్టుబడులు పెట్టి నష్టాలు సరిచేసిన పొగాకు రైతులకు ఈ ఏడాది పొగాకు దారా ఆశాజనకంగా ఉండటంతో అప్పుల ఊబి నుండి బయట పడతామని రైతులు అంటున్నారు

మొక్కల పెంపు అందరి బాధ్యత
శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర - రాజానగరం : మొక్కల పెంపు అందరి బాధ్యత అని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ జి. ప్రసాద్ అన్నారు. గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని మండలంలోని దివాన్ చెరు వు గ్రామంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో మొక్కల ఆవశ్యకతను వివరిస్తూ స్కూల్ కి సంబందించి వివిధ శాఖల అధిపతులు, ఉపాధ్యా యులు,విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు.స్కూల్ ప్రాంగణం వద్ద నుండి జాతీయ రహదారి వరకు ర్యాలీగా తరలి వెళ్లి మొక్కల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లా డుతూ మొక్కలు పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలి వీస్తుందనీ,తద్వారా నేటితరంతో బావితరానికి ఆరోగ్యాన్ని అందించినవారు అవ్వుతారని చెప్పారు. సమీప గ్రామాల్లో అతిసార వ్యాధి ఎక్కువగా ఉందని,అందుచే చుట్టుపక్కల మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి కోరారు. ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలని,త్రాగు నీటిని వృథా చేయకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎజిఏం.యం. సురేష్, ఆర్.ఐ వి.ఉదయ్, హై స్కూల్ కోఆర్డినేటర్ ఎ.రామారావు, సి.బ్యాచ్ ఇన్చార్జ్ ఎం. సాయి ప్రణీత్, డీన్ బి.విజయ్, ఉపాధ్యాయలు, ఇతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : నగర పంచా యతీ పరిధిలో, మండలం లోని లింగంపర్తి, భద్రవరం గ్రామాలలో పంట కాలు వలో పూడికతీత పనులను మంగళవారం ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ, జనసేన పార్టీ ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడి యాతో మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయం, అనుబంధ రంగాలలో పనిచేస్తూ జీవనోపాధిని కొనసాగిస్తుంటారని వ్యవసాయ ప్రాధాన్యత గల ఈ నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో జలాశయాలు, కాలువలను నిర్లక్ష్యం గా వదిలేసి, ఎక్కడా కాలువలు తవ్వించడం గాని, పూడిక తీత పను లను చేపట్టడం గాని గత ప్రభుత్వం గత ఐదేళ్లకాలంలో చేయలేదని వారు అన్నారు. అంతేకాకుండా కాలువలు మూసి ఉండటంతో నీరు పారే పరిస్థితి లేదని అందుకే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి ప్రాజెక్టులు పర్యవేక్షణ పై దృష్టి పెట్టిందని, పూడికతీత పనులను చేపట్టి రైతాంగానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువలలో నీరు పారేలా చర్యలు తీసుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి రవికుమార్

విశాలాంధ్ర - ఆలమూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీలో చేరుటకు డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, ఆ నోటిఫికేషన్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సు ను చదివేందుకు ఎదురు చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ తొలగి స్తున్నట్లు ప్రకటించగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మాత్రం బీకాం జనరల్ కోర్సును కొనసాగిస్తు న్నారన్నారు. అలా చేయడంవల్ల ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలో విద్యార్థులు లేక మూతపడుతున్నటువంటి పరిస్థితి ఏర్పడిందని, ఈనెల 10వ తేదీ నుంచి డిగ్రీ ప్రవేశాలకు కౌన్సిలింగ్ జరుగుతున్న నేప థ్యంలో ఆన్లైన్లో రిజర్వేషన్ ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో బీకాం జనరల్ కోర్స్ ఆప్షన్ కనిపియ డంలేదని, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మాత్రం బీకం జనరల్ కోర్స్ కనిపిస్తుందన్నారు. కావున దీనిపైన తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోర్సును కొనసాగిం చాలని, ఈనెల 10వ తేదీ నుంచి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోర్సు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.

ఏటిగట్లు పటిష్టం చేయాలి

విశాలాంధ్ర - రాజోలు : వరదల సీజన్ ప్రారంభం అవు తున్న నేపథ్యంలో ఏటిగట్లు పటిష్టపరచాలని అంబేద్కర్ కోన సీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశిం చారు. మంగళవారం ఆయన రాజోలు మండలంలో 2022 సంవత్సరంలో వరద ప్రభావానికి గురైన రాజోలు మేకలపాలెం, పల్లిపాలెం ఏటీగట్టి ప్రాంతాల్లో పర్యటించారు. ఏటీగట్టు ఎత్తు తక్కువగా ఉన్నందున వరద నీరు ఏటిగట్టు పైనుండి పొంగి పొర్లిందని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసికువెళ్లారు. తక్షణమే ఏటీగట్టు ఎత్తు అడుగున్నర పెంచాలని హెడ్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట రాజోలు తహశీల్దార్ గోపాలకృష్ణ, హెడ్ వర్క్స్ డీఈఈ జి శ్రీనివాస్, ఏఈఈ టిబిఎల్ఎన్ మూర్తి తదితరులు ఉన్నారు.

ఆహార భద్రతపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - రాజా నగరం : ఆహార భద్రత పై ప్రతిఒక్కరు తప్పనిసరిగా అవగా హన పెంచుకోవాలని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ అన్నారు. ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 పురస్కరించుకొని మండలం లోని నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. అతిసార వ్యాధి దాని నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిజియు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.మనోహర్ బాబు మాట్లాడుతూ అతి సారా నివారణ, జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రొ.వై.శ్రీని వాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పీవో డాక్టర్ శీలం రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఓలు డాక్టర్ కె.సుజాత, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం గోపాలపురం గ్రామంలో మంగళ వారం మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి ఆధ్వర్యంలో చిరుధాన్యాలు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది అని, దీనికీ గాను 50 శాతం రాయితీ పై విత్తనాలు అందజేసి, సాగు మెలకువలు పాటించేలా చూసి మళ్ళీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. చేసి భరోసా ఇస్తోందని కావున మెరక మరియు మూడు సంవత్సరాల వయసులోపు పామాయిల్ తోటలలో రాగులు, కొర్రలు మొదలగు చిరుధాన్యాలు సాగుచేసి అధిక ఫలసాయం పొందాలని తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి కౌలు రైతు కౌలు కార్డు పొంది ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు ఉప యోగించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామాంజ నేయులు, విఏఏ అలీషా, విహెచ్ఏ కనకయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్కు విరాళం

విశాలాంధ్ర - ఐ పోలవరం : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్ట్కి ముమ్మిడివరానికి చెందిన నలమాటి ఏడుకొం డలు, వీర లక్ష్మీదంపతులు పదివేల రూపాయలు విరాళం ఆలయ పర్యవేక్షణ అధికారి బి వీరభద్ర రావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారా యణ అభినందించారు. కార్యనిర్వాహణాధికారి మాట్లాడుతూ"శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్"కి 80 జి వర్తింపు ఉన్నందున విరివిగా విరాళాలు అందించాలని ఏదేని గుర్తింపు కార్డ్ చూపించి అన్నదాన విరాళంలో పాల్గొనాలని అధికారులు సూచించారు. తొలుత వీరికి అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం అం దించి అనంతరం ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, స్వామి వారి చిత్ర పటం, ప్రసాదం అందజేసి సత్కరించారు. నిత్యం స్వామి వారి ఆలయంలో రాత్రి కల్యాణానికి విచ్చేసే భక్తులకు శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ ద్వారా నిత్యాన్నదాన పథకాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ వందల మంది భక్తులు నిత్యాన్నదానంలో పాల్గొంటూ ఉంటారు. స్వామి వారికి సమర్పించే విరాళాలు, పరోక్ష సేవలు ఆన్లైన్ ద్వారా చెల్లించే అవకాశం ఉందని దేవాదాయశాఖ అధికారిక వెబ్సైట్www.srivee reswaras wa mytemple.com, ap temple.ap.gov.in స్వామివారి ఆల యాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఉచిత ఇసుక విధానం కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఉచిత ఇసుక విధానం రాష్ట్ర ప్రభుత్వం అమలు లోకి తీసుకురావడంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఆధ్వర్యంలో మంగళవారం ఏలేశ్వరం నుండి లింగం పర్తి మీదుగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీను ఎమ్మెల్యే కూటమి నేతలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞత తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవో నెంబర్ 43 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెల రోజులలోపే అమలు చేయడమంటే పేదప్రజల పట్ల ఎన్డీఏ కూటమికి, ప్రభుత్వానికి ఉన్న ఆలోచనలకు నిదర్శనమని అన్నారు. వైసిపి దోపిడీ కారణంగా నిర్మాణరంగం గత ఐదేళ్ల కాలంలో కుదేలైందని ఆమె ఎద్దేవా చేశారు. వారి దోపిడీని చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచి తంగా ఇసుక ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ గంటా బాలుదొర, ఏలేశ్వరం మండలం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నగర పంచాయతీ కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ భద్రవరం ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, చిక్కాల లక్ష్మణరావు తదితర టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎం సురక్ష మాతృత్వ అభియాన్కు ఎనిమిది సంవత్సరాలు

విశాలాంధ్ర - ఆలమూరు : మాతృత్వ శిశు మరణాల నివారణకు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకం మంగళవారం నాటికి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈసందర్భంగా ఆలమూరు మండలంలోని పెదపళ్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు పి భవానీశంకర్, డి సువర్చలా దేవి, డి సాయి కిషోర్, ఆర్ మల్లిఖార్జున్ నేతృత్వంలో వైద్యా రోగ్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పీఎంఎస్ఏంఏ పథకంలో భాగంగా పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 132 మంది గర్భిణులకు వైద్య,రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్ప కుండా తొమ్మిది లేక పదవ తేదీన బాలింతలు, గర్భిణులకు ఏఎంఎస్ఎంఏ ద్వారా నిర్వ హిస్తున్న వైద్య సేవలతో పాటు సిహెచ్సి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత ఇసుక సరఫరా ప్రారంభం

విశాలాంధ్ర - పెరవలి: ఉసులమర్రు ఇసుక గుట్ట నుండి ఉచిత ఇసుక విధా నాన్ని మంగళవారం ప్రారం భించారు. ఒక వ్యక్తి ఒక రోజులో కేవలం 20 టన్ను లకు మాత్రమే ఇసుకను తీసు కువెళ్లేందుకు అనుమతి ఉం టుందని తహసీల్దార్ సుధ తెలిపారు.టోల్ ఫ్రీ నెంబర్ 180042 ఉచిత ఇసుక విధానానికి 24/7 కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని ఉసులుమర్రు వద్ద 33065 టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు.ఒక్కో టన్ను ఇసుక కొరకు 270 రూపా యలు చెల్లించాలని అన్నారు.ఈకార్యక్రమంలో అధికారులు నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమనిల్వలు పట్టివేత

విశాలాంధ్ర - కాకినాడ : రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు వారికి వచ్చిన పీడీఎస్(చౌక బియ్యం)అక్రమ నిల్వ , రవాణాకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు 8వ తేదీన 1). కాకినాడ జిల్లా కోటనందూరు మండలం, కోటనందూరు గ్రామములో శ్రీ మహా లక్ష్మి రైస్మిల్లో పీడీఎస్(చౌక బియ్యం)అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించిన విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ , సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి తనిఖీ చేయగా సుమారు 25300 కేజీల పిడిఎస్ బియ్యం ను గుర్తించారు. సదరు పోతల రాంబాబుకి చెందిన రైస్ మిల్లో పీడీఎస్(చౌక బియ్యం)ను కోటనందూరు పరిసర ప్రాంతములలోని రేషన్ కార్డుదారుల నుండి కిలో రూ.18/-లకు కొనుగోలు చేసిన మోటార్ సైకిలిస్ట్ల నుండి, అదే బియ్యాన్ని కిలో రూ.20/-లకు కొనుగోలు చేసి కిలో రు.23/-లకు ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి అక్రమముగా సిజి04 ఎంవై 4540 అను నెంబర్ గల టాటా కంపెనీ లారీలో తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సివిల్ సప్లయ్స్ అధికారులు ఈ విదంగా పిడిఎస్ బియ్యాన్ని అక్రమముగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి, అక్రమ ముగా రవాణా చేస్తున్న, అమ్మకము చేస్తున్న 1. పోతల రాంబాబు, 2. శెట్టి శ్రీనివాసరావ్, 3. కోన ప్రభుదాస్, 4. మోహన్ లాల్ యాదవ్, 5. ఆనంద్ దేవాంగన్, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కోసం కోటనందూరు పోలీస్ స్టేషన్ వారికి సిఫారసు చేయటమైనది, అధికారులు రైస్మిల్లో సిజి04 ఎంవై 4540 అను నెంబర్ గల టాటా కంపెనీ లారీలోని 25300 కిలోల పిడిఎస్(చౌక బియ్యం)ను, 4- ఎలక్ట్రికల్ కాటాలను, 1400 కిలోల ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్లను, 12300 కిలోల బియ్యం, 3750 కిలోల ధాన్యం, 1500 కిలోల బ్రోకెన్ రైస్, 1050 కిలోల రైస్ బ్రాన్లను సీజ్ చేసినారు. వీటి విలువ సుమారు రు. 40,93,548/- గా నిర్ధారించారు.

2). దా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరం మండలములోని, మాచవరం గ్రామం, సరిట వీధి ఏరియాలో, ఒక పాడుబడిన గది నందు పిడిఎస్(రేషన్ బియ్యం) బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్నా సమాచారముతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతో సదరు ప్రదేశంలో తనిఖీ చేయగా, సదరు గదిలో 41 బస్తాలలో సుమారు 2411 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. సదరు పిడిఎస్(చౌక బియ్యం)ను మాచవరం గ్రామ నివాసి అయినా మేడపాటి రామారెడ్డి అను ఆసామి రాయవరం మం డలం పరిసర ప్రాంత గ్రామములలోని రేషన్ కార్డుదారుల నుండి కిలో రూ. 20/-లకు కొనుగోలు చేసి, అదే బియ్యాన్ని కిలో రూ.22/-లకు ఇటుక బట్టి కార్మికులకు విక్రయిస్తున్నారు. సదరు బియ్యంకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేనందున సివిల్ సప్లయ్స్ అధికారులు, రాయవరం మండలం వారు సుమారు రూ.1,09,700/-లు విలువ గల 2411 కేజీల పిడిఎస్(చౌక బియ్యం)ను సీజ్ చేసి 6-ఏ క్రింద కేసు నమోదు చేసి, పిడిఎస్ బియ్యాన్ని అక్రమముగా కొనుగోలు చేసి, అమ్మకము చేస్తున్న మేడపాటి రామారెడ్డి మరియు సంబందిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు రాయవరం పోలీస్ స్టేషన్కు సిఫారసు చేయటమైనది.

ఈ సందర్భముగా ఎస్పి కెఎస్ఎస్వి సుబ్బారెడ్డి, ఐపిఎస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్(చౌక బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుంది అని, ఎవ్వరైనా రైస్ మిల్ యజమానులు గాని మరియు ఎవరయినా వ్యక్తులు గాని పిడిఎస్(చౌక బియ్యం) కొనడం, అమ్మడం చేస్తే సదరు రైస్ మిల్/వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలియచేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ- జగన్నాథరెడ్డి, ఎఒ-భార్గవ మహేష్, ఎజి- లక్ష్మీనారాయణ, డిసిటిఒ నవీన్ కుమార్, పిసిఎస్ లోవరాజు, వలీ, వీరబాబు, శివ , సివిల్ సప్లయ్స్ అధి కారులు ఎఎస్ఒ ప్రసన్న లక్ష్మి, సిఎస్డిటిలు కిరణ్ , అలీషా వార్లు పాల్గొన్నారు.